# కౌంటింగ్‌కు సర్వం సిద్ధం



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టెబుళ్లను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ శరత్

- పటాన్‌చెరులో ఏర్పాట్లు తనిఖీ చేసిన సంగారెడ్డి కలెక్టర్ శరత్
- కౌంటింగ్ హాల్ వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు
- పారదర్శకంగా కౌంటింగ్ వ్యవస్థ ఏర్పాటు
- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- భారీగా పోలీసు బలగాల ఏర్పాటు
- శాంతిభద్రతల కోసం ప్రత్యేక చర్యలు

పటాన్‌చెరు, డిసెంబర్ 2 : ఎన్నికల కౌంటింగ్‌కు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఓటర్ల తీర్పు ప్రకటించడానికి ఓట్ల లెక్కింపునకు అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్తిగా పారదర్శంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేకంగా టేబుళ్లు వేస్తున్నారు. పోస్టల్ బ్యాలెటన్లు లెక్కించడానికి ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ చేపడుతున్నారు. కౌంటింగ్ హాల్ దృశ్యాలు పెద్ద డిజిటల్ తెరపై ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. ఏజెంట్లు స్పష్టంగా పడిన ఓట్లను చూసేలా మెష్ ఏర్పాటు చేశారు. ఏజెంట్లు లోపలికి రాకుండా అడ్డుగా తెరలు పెట్టారు. పూర్తిస్థాయిలో పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల అబ్జర్వర్లు కూడా ప్రత్యేక నిఘా పెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తున్నారు.

**కౌంటింగ్ హాళ్లను పరిశీలించిన కలెక్టర్ శరత్**

సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లను కలెక్టర్ శరత్ శనివారం పరిశీలించారు. ఎన్నికల సంఘం పేర్కొన్న అన్ని నిబంధనలు పాటించాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్‌లో ఏజెంట్లు అడిగే ప్రశ్నలు, సందేహాలను నివృత్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పోస్టల్ బ్యాలెట్లను ఏజెంట్ల ఎదుట ప్రదర్శించాలని సూచించారు. ప్రతి ఓటూ విలువైనదని, ఎక్కడా పొరపాటు జరగకుండా చూడాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. సీసీకెమెరాలు, స్ట్రాంగ్‌రూం వద్ద రక్షణ ఇతర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. లెక్కింపు ప్రక్రియ ప్రత్యక్ష ప్రసారం కోసం ఏర్పాటు చేసిన తెరలను పరిశీలించి, వాటి పనితీరు పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం రికార్డింగ్ అవుతున్నది. కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత బలగాలను మోహరించారు. మొత్తంగా గీతం డీమ్డ్ యునివర్సిటీ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి అభ్యర్థులు, ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది, అధికారులకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. ప్రెస్‌కోసం ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఫలితాలను రౌండ్లవారీగా అధికారులు తెలియజేస్తారు.

**భారీగా భద్రత ఏర్పాట్లు**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఎన్నికల కౌంటింగ్ ఉండడంతో పోలీసులు మూడంచెల రక్షణ కల్పిస్తున్నారు. గీతం కౌంటింగ్ హాల్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని అదనపు ఎస్పీ అశోక్ తెలిపారు. కౌంటింగ్ సెంటర్ వద్ద ఉదయం 6గంటల నుంచి పోలీసు నిబంధనలు అమలు అవుతాయన్నారు. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుందని, గుర్తింపు కార్డు ఉన్నవారికే అనుమతి ఇస్తామన్నారు. ధర్నాలు, మైకులు వాడితే చర్యలుంటాయన్నారు. ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని కోరారు. 500 మంది పోలీసులు ఎన్నికల కౌంటింగ్ విధుల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, అబ్జర్వర్లు, ఆర్‌వోలు పాల్గొన్నారు.




జహీరాబాద్ కౌంటింగ్ హాల్‌లో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టెబుళ్లు



కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

## జహీరాబాద్ సర్కార్ దవాఖానకు
# కేంద్ర ప్రభుత్వ అవార్డు

- ఉత్తమ వైద్యసేవలకు 'ముస్కాన్' అవార్డు
- మూడేండ్ల వరకు ప్రతి ఏడాది రూ.9 లక్షలు ప్రోత్సాహకం ఇవ్వనున్న కేంద్ర ప్రభుత్వం

జహీరాబాద్, డిసెంబర్ 2 : జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానలో రోగులకు కార్పొరేటు స్థాయి వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయి 'ముస్కాన్' అవార్డు ప్రకటించారని జహీరాబాద్ ప్రభుత్వ దవాఖాన వైద్యులు శ్రీధర్, శేషురావు తెలిపారు. శనివారం దవాఖానలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. కేంద్ర వైద్యారోగ్యశాఖ జాతీయ ఆరోగ్యమిషన్ జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై క్షేత్రస్థాయిలో సర్వే చేశారని తెలిపారు. ఇక్కడ అందిస్తున్న వైద్యసేవలను ప్రశంసిస్తూ ముస్కాన్ అవార్డు ప్రకటించారన్నారు. జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానలో మాతాశిశులకు అందిస్తున్న వైద్యసేవలపై కేంద్ర ప్రభుత్వ అధికారులు సర్వే చేశారన్నారు. నవజాతి శిశువులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించడంతోపాటు శిశువులతోపాటు బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. శిశు మరణాలు తగ్గించేందుకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అక్టోబర్ నెలలో కేంద్ర వైద్య బృందం జహీరాబాద్ సర్కార్ దవాఖానలో క్షేత్రస్థాయిలో పరిశీలించి మార్కులు వేశారన్నారు. జహీరాబాద్ దవాఖానకు 87 మార్కులు రావడంతో ముస్కాన్ అవార్డు ప్రకటించారన్నారు. అవార్డుతోపాటు మూడేండ్ల పాటు ప్రతి ఏడాది రూ. 9 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. మూడేండ్ల పాటు నగదు పంపిణీ చేస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే నగదుతో దవాఖానలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. 2023లో జహీరాబాద్ దవాఖానకు మూడు అవార్డులు వచ్చాయని, దీంతో మూడేండ్ల పాటు రూ.27 లక్షలు కేంద్రప్రభుత్వం ఇస్తుందన్నారు. దవాఖానలో రోగులకు మౌలిక సదుపాయలు కల్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రాఘవర్ధన్‌రెడ్డి, మంజులతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



జహీరాబాద్ సర్కార్ దవాఖానలో ప్రసంశాపత్రాన్ని చూపుతున్న వైద్యులు శ్రీధర్, శేషురావు

# మానవ సేవే మాధవ సేవ

- చెన్న సిద్ధారామపండితారాధ్య శివాచార్య మహాస్వామి




అనాథాశ్రమం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ సిద్ధారామపండితారాధ్య శివాచార్య మహాస్వామి

ఝరాసంగం, డిసెంబర్ 2 : 'మానవ సేవే మాధవ సేవ' అనే సూక్తితో ప్రతి ఒక్కరూ సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని శ్రీశైలం జగద్గురు డాక్టర్ చెన్న సిద్ధారామపండితారాధ్య శివాచార్య మహాస్వామి అన్నారు. శనివారం ఝరాసంగం శివారులోని ధనశ్రీ హీరే మఠ్ పీఠాధిపతి వీరేశ్వర శివాచార స్వామిజీ అనాథలు, వృద్ధులు, అర్చకుల కోసం ఏర్పాటు చేసిన ఆశ్రమాన్ని వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో రుద్రహోమం, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పాల్గొన్నారు.

# గంజాయి తరలిస్తున్న కారు బోల్తా

- బుచినెల్లి శివారులో అదుపు తప్పిన కారు
- రూ. 25లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- హైదరాబాద్ వైపు నుంచి ముంబైకి తరలింపు
- కేసు దర్యాప్తు చేస్తున్న చిరాగ్‌పల్లి పోలీసులు

జహీరాబాద్, డిసెంబర్ 2 : రోడ్డు ప్రమాదంలో గంజాయి బయట పడిన ఘటన జహీరాబాద్ మండలం బుచినెల్లి శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. హైదరాబాద్ నుంచి ముంబైకి గంజాయిని తరలిస్తున్న కారు శుక్రవారం రాత్రి బుచినెల్లి శివారులోని 65 వ జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది. స్మగర్లు అతివేగంతో కారును నడపడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కారులో రూ.25 లక్షల విలువ చేసే గంజాయి ఉందని గుర్తించారు. రెండు క్వింటాళ్ల గంజాయిని ప్యాక్ చేసి ముంబైకి తరలిస్తున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. కారు బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన స్మగర్లులు అక్కడి నుంచి పరారయ్యారన్నారు. చిరాగ్‌పల్లి పోలీసులు ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేసుకొని కారుతోపాటు గంజాయిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఎన్నికల విధులో ఉండడంతో జాతీయ రహదారిపై తనిఖీలు చేయకపోవడంతో స్మగర్లు నిర్భయంగా గంజాయిని తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నారు. ఈ మేరకు చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నారు.



బుచినెల్లి శివారులో అదుపు తప్పి బోల్తా పడిన కారు



బోల్తాపడిన కారులో ఉన్న గంజాయి ప్యాకెట్లు

# రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముళ్లు మృతి

- పాపన్నపేట శివారులో బైక్‌ను ఢీకొట్టిన లారీ
- అక్కడికక్కడే మృతి చెందిన సోదరులు



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు

పాపన్నపేట, డిసెంబర్ 2 : మండలకేంద్రం పాపన్నపేట శివారులో బారాకెనాల్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ముళ్లు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. టేక్మాల్ మండలంలోని హసన్ మహమ్మద్‌పల్లి గ్రామానికి చెందిన కున్‌సోత్ చిన్య(45), దేవ్య(42)బైక్‌పై పాపన్నపేట నుంచి లక్ష్మీనగర్‌కు ధాన్యం విత్తనాలను తీసుకురావడానికి బైక్‌పై వెళ్తున్నారు. పాపన్నపేట శివారులోని బారాకెనాల్(బ్రిడ్జ్)వద్ద ఎదురుగా వస్తున్న లారీ వీరు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో అన్నదమ్ముళ్లు అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని రోదించడంతో అక్కడ ఉన్న ప్రయాణికులు కంటతడి పెట్టుకున్నారు. పాపన్నపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహలను మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో గతంలో ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి.



మృతులు చిన్య(ఫైల్), దేవ్యా(ఫైల్)